## మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు



మంత్రి దామోదర రాజనర్సింహకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల

గద్వాల, డిసెంబర్ 27 : ఉమ్మడి జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన సన్నాహక సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

## 30న జాతీయ లోక్ అదాలత్

గద్వాల అర్బన్, డిసెంబర్ 27 : కక్షిదారులు రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని, అందుకు జాతీయ లోక్ అదాలత్ ఎంతో దోహదపడుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.కుషా పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టులో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఈనెల 30న జిల్లాకేంద్రంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సామరస్యంగా పరిష్కరించుకోదగ్గ కేసులు, రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్, సివిల్, వివాహ, కుటుంబ తగాదా, రోడ్డు ప్రమాదాలు, చిట్‌ఫండ్, ఎలక్ట్రిసిటీ, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ కేసుల సహా ఇతర కేసుల పరిష్కారానికి ఈ వేదిక సరైనదని అన్నారు. గత లోక్ అదాలత్‌లో 2,000 పైగా కేసులు రాజీ పడ్డారని, ఈ దఫాలో ఎక్కువ మొత్తంలో కేసులు రాజీ అయ్యేందుకు కృషి చేస్తున్నామన్నారు.

## ప్రజాపాలన గ్రామసభల ప్రత్యేక అధికారిగా సుబ్రహ్మణ్యం

గట్టు, డిసెంబర్ 27 : ప్రజాపాలన గ్రామసభల గట్టు మండల ప్రత్యేకాధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్ఏ) సుబ్రహ్మణ్యంను నియమించారు. గ్రామసభలను నిర్వహించడానికి మూడు టీంలను ఏర్పాటుచేశారు. మొదటి టీంకు తాసీల్దార్ ధనుంజయ, రెండో టీంకు ఎంపీవో మహేశ్, మూడో టీంకు డిప్యూటీ తాసీల్దార్ సీహెచ్ రవికుమార్ నేతృత్వం వహించనున్నారు.

## టెంకాయల వేలం @ రూ.4.64లక్షలు

ధరూర్, డిసెంబర్ 27 : మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయ టెంకాయల వేలం రూ.4.64లక్షల పలికినట్లు ఆలయ ధర్మకర్త గిరిరావు తెలిపారు. 2024 ఏడాదిగానూ బుధవారం నిర్వహించిన వేలంలో ఎనిమిదిమంది పాల్గొనగా, వీరిలో భీంపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు సొంతం చేసుకున్నాడు. అలాగే కొబ్బరి చిప్పల సేకరణకు జరిగిన వేలంలో పెద్దచింతరేవుల గ్రామానికి చెందిన వీరేశ్ రూ.1,11,000కు సొంతం చేసుకున్నారు. గతేడాది కంటే రూ.1,25,000 అధికంగా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. వేలంలో ఆలయ ఈవో కవిత, ప్రత్యేకాధికారిగా ఆదిశిలా క్షేత్రం ఈవో సత్యచంద్రారెడ్డి, పెద్దలు పాల్గొన్నారు.

## గాయపడిన జింక ఫారెస్టు అధికారులకు అప్పగింత

కొత్తకోట, డిసెంబర్ 27 : మండలంలోని అప్పరాల గ్రామ సమీపంలోని రామన్‌పాడు ఎడమ కాల్వలో ఓ జింక గాయాలతో స్థానిక రైతులకు కనిపించింది. గాయపడిన జింకను రైతులు పట్టుకొని సర్పంచ్ హిమబిందు, గ్రామ పెద్దలకు అప్పగించారు. వెంటనే స్పందించిన వారు మండల పశువైద్యాధికారి విజయ్‌కుమార్‌కు సమాచారం అందించడంతో అప్పరాల గ్రామానికి చేరుకున్న పశువైద్యాధికారి విజయ్‌కుమార్ జింకకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం జిల్లా ఫారెస్టు అధికారులను పిలిపించి వారికి జింకను అప్పగించారు. గాయపడిన జింకను రక్షించి వైద్య పరీక్షలు చేయించిన రైతులు, గ్రామస్తులను ఫారెస్టు అధికారులు అభినందించారు.

## నాన్ గెజిటెడ్ వెటర్నరీ అధికారుల జిల్లా కార్యవర్గం ఎన్నిక

వనపర్తి, డిసెంబర్ 27 : జిల్లా పశుసంవర్ధక శాఖ నాన్ గెజిటెడ్ వెటర్నరీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి ఎన్నికైనట్లు తెలిపారు.బుధవారం జిల్లా పశువైద్యకార్యాలయంలో నిర్వహించి ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారిగా రాష్ట్ర అధ్యక్షుడు బింగి సురేశ్, పరిశీలకులుగా అభిషేక్ రెడ్డి వ్యవహరించారు. ఎన్నికలో జిల్లా నాన్ గెజిటెడ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎస్ హరీశ్, సహధ్యక్షుడిగా ఎండీ హబీబ్, కోశాధికారిగా సత్యం ఎన్నికయ్యారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడించాలి

గోపాల్‌పేట, డిసెంబర్ 27 : పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎంఈవో కాటమోని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని బండపల్లి ప్రాథమిక, మున్ననూర్‌లో ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం క్లాస్ రూంలో విద్యార్థుల సామర్థ్యం తెలుసుకునేందుకు ఆయా అంశాలపై ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఈసంద్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేవిధంగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ రాంచంద్రయ్య, బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణయ్య ఉన్నారు.

## ఉరేసుకొని యువతి ఆత్మహత్య

గద్వాల అర్బన్, డిసెంబర్ 27 : ఉరేసుకొని యువతి అత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం జిల్లా కేంద్రంలోని వెంకటరమణ కాలనీకి చెందిన యువతి(20) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని అత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆరా తీస్తున్నారు. యువతి మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ కుటుంబ సభ్యులు ఆరోపించారు.

## నేడు పునర్వసు వేడుకలు

ఇటిక్యాల, డిసెంబర్ 27: బీచుపల్లి క్షేత్రంలోని కోదండరామాలయములో స్వామివారి జన్మనక్షత్రమున గురువారం స్వామివారి కల్యాణ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు తెలిపారు. కనులపండువగా నిర్వహించే వేడుకలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలన్నారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

## వ్యక్తిపై దాడి: కేసు నమోదు

వడ్డేపల్లి, డిసెంబర్ 27: మండలంలోని జిల్లెడుదిన్నెకు చెందిన దస్తగిరిపై కొందరు యువకులు చిన్నపాటి వివాదంతో ఘర్షణ పడ్డారు. వారిమధ్య వాగ్వాదం పెరిగి ఘర్షణ పెరగడంతో దస్తగిరికి గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన నలుగురిపై ఎస్సై నరేశ్ కేసు నమోదు చేసి విచారణ చేడుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

EMI PLOTS
★EMI Plots in Jadcherla MUDA Approved Layout. గజం: 8,000/- రూ.లకే, 100 పడకల ప్రభుత్వ హాస్పిటల్‌కి అతి చేరువలో, నెలసరి వాయిదా పద్ధతిలో 10,000/- రూ.లకే ప్లాట్లు పొందవచ్చు. స్పాట్ రిజి॥. 7780483434.
NT-314492

PLOT FOR SALE
★మహబూబ్‌నగర్ to నాగర్‌కర్నూల్ హైవే ఫేసింగ్ 300 ఎకరాల డిటిసిపి అప్రూవల్ లేఔట్‌లో 99 నెలల EMI ఫెసిలిటీ కలదు. Marketing Executives కావలెను. Cont: 9133399095
NT-320376

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

# ప్రజలకు మెరుగైన పాలన అందించాలి

- జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్
- ప్రజాపాలన గ్రామసభల నిర్వహణపై అధికారులకు అవగాహన సదస్సు

కొత్తకోట, డిసెంబర్ 27 : ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు అధికారులు కృషి చేయాలని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ప్రజాపాలనపై అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి యుగేంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని వారికి కావాల్సిన పథకాలను అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, తాసీల్దార్ బాల్‌రెడ్డి, ఏవో మున్నా, రవీందర్‌బాబు పాల్గొన్నారు.

### పకడ్బందీగా నిర్వహించాలి

అయిజ, డిసెంబర్ 27: మండలంలోని కిష్టాపురం, వెంకటాపురం, గుడుదొడ్డి, జడదొడ్డి గురువారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏపీవో నర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన గ్రామసభల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 29న యాపదిన్నె, కుర్వపల్లి, నౌరోజీక్యాంపు, ఉప్పలక్యాంప్, 30న మేడికొండ, చిన్నతాండ్రపాడు, జనవరి 2న తూంకుంట, బింగిదొడ్డి, వేణిసోంపురం, కేశవరం, 3న ఎక్లాస్‌పురం, సంకాపురం, పులికల్, 4న ఈడిగోనిపల్లి, ఉత్తనూర్, రాజాపురం, బైనపల్లి, 5న భూంపురం, మూగోనిపల్లి, టీటీదొడ్డి, కొత్తపల్లి, 6న ఉప్పల, కుటుకనూర్, సింధనూర్‌లో ప్రజాపాలన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏపీవో శరత్‌కుమార్, ఏపీఎం గోపాల్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### ఇటిక్యాల మండలంలో..

ఇటిక్యాల, డిసెంబర్ 27: మండలంలోని గోపల్‌దిన్నె, మొగలిరావుల చెరువులో గురువారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాఘవ తెలిపారు. 29న శివనంపల్లె, శెనిగపల్లె, 30న, నక్కలపల్లె, బుడ్డారెడ్డిపల్లె, జనవరి 2న సాతర్ల, వావిలాల, 3న పెద్దదిన్నె, ఉదండాపురం, 4న మునుగాల, చాగాపురం, 5న ఇటిక్యాల, షాబాదాలో గ్రామసభలు ఉంటాయన్నారు.

### వీపనగండ్ల మండలంలో..

వీపనగండ్ల, డిసెంబర్ 27: మండలంలోని ఆయా గ్రామాల్లో నేటి నుంచి నిర్వహించే ప్రజాపాలనపై నిర్వహించే సభలను జయప్రదం చేయాలని తాసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో కతలప్ప తెలిపారు. గురువారం నాగవరం తండా, నాగర్లబండ తండా, వల్లభాపురం తండా, కొర్లకుంట.. 29న గోవర్ధనగిరి, వల్లభాపురం.. 30న గోపల్‌దిన్నె, సంగినేనిపల్లి.. 2న పుల్గర్‌చర్ల, తూంకుంట..3న కల్వరాల, సంపత్‌రావుపల్లి.. 4న బొల్లారం, వీపనగండ్ల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తారని తెలిపారు.

### మదనాపురం మండలంలో..

మదనాపురం, డిసెంబర్ 27 : మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం నుండి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ నిర్వహిస్తున్నామని తాసీల్దార్ అబ్రహం లింకన్ అన్నారు. బుధవారం ఎంపీపీ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో పుష్ప, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

### నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఆత్మకూరు, డిసెంబర్ 27: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభం కానుందని స్పెషల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాలలో ముందుగానే దరఖాస్తుల స్వీకరణ తేదీలు టాం.. టాం.. ద్వారా ప్రచారం చేయాలన్నారు. 28న మేడెపల్లి, దేవరపల్లి, 29న గుంటిపల్లి, తూంపల్లి, 30న కత్తేపల్లి, బాలకిష్టాపూర్, 2న మోట్లంపల్లి, రేచింతల, 3న పిన్నెంచెర్ల, జూరాల, 4న మూలమల్ల, ఆరెపల్లి, 5న తిప్డంపల్లి గ్రామాల్లో తాసీల్దార్, ఎంపీడీవోలతో స్వీకరించబడునట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. మున్సిపాలిటిలోనూ ప్రతి వార్డులో ప్రత్యేకంగా శిబిరాలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కమిషనర్ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీహరి, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, అంగన్‌వాడీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

### ధరూర్ మండలంలో..

ధరూరు, డిసెంబర్ 27 : మండలంలోని జాంపల్లి, ఓబులోనిపల్లి, పెద్దపాడు, ఎమునోనిపల్లి గ్రామాల్లో గురువారం ప్రజాపాలన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ జబ్బార్ తెలిపారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల బిల్డింగ్‌లలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాంపల్లి, ఓబులోనిపల్లి గ్రామాల్లో ఎంపీడీవో అబ్దుల్ జబ్బార్, పెద్దపాడు, ఎములోనిపల్లి గ్రామాల్లో తాసీల్దార్ వహిదా ఖాతున్ పాల్గొంటారని తెలిపారు.

### నేటినుంచి గ్రామసభలు

మల్దకల్, డిసెంబర్ 27 : సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రజాపాలన గురువారం నుంచి ప్రారంభమవుతుందని తాసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. మండలంలో 25 గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 14,666 రేషన్ కార్డులు ఉన్నాయని, 80 కార్డులకు గానూ ఒక్కో కౌంటర్ ఏర్పాటు చేశామని, మొత్తం 196 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. లబ్ధిదారులు ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్, ఫొటోలు ఫారానికి జత చేయాలన్నారు. రైతు భరోసాకు సంబంధించిన పాసుబుక్, జాబ్ కార్డు జిరాక్స్, కరెంట్ మీటర్ నెంబర్ రాయాల్సి ఉంటుదన్నారు.

### విజయవంతం చేయాలి

పాన్‌గల్, డిసెంబర్ 27 : ప్రజాపాలన కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని మండల ప్రత్యేకాధికారి రహెమాన్, తాసీల్దార్ రాంబాబు, ఎంపీవో రఘురామ్ అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమం అమలుపై వివిధ శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మీడియా, చాటింపు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో మండల అధికారులు లక్ష్మణ్‌నాయక్, ఎస్సై వేణు, డిప్యూటీ తాసీల్దార్ అశోక్, ఏపీఎం సక్రూనాయక్, అధికారులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వనపర్తి జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్



కొత్తకోటలో అవగాహన సదస్సుకు హాజరైన అధికారులు

### గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించాలి

చిన్నంబావి, డిసెంబర్ 27 : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 28 నుంచి జనవరి 6వ వరకు ప్రతి గ్రామ పంచాయతీలలో నిర్వహించే గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని మండల ప్రత్యేక అధికారి సుల్తాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రవినారాయణ అధ్యక్షతన ఆయా గ్రామాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకునే అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక కౌంట ర్లు ఏర్పాటు చేయాలని, రద్దీ దృష్ట్యా అదనపు కౌంటర్లను సైతం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. దరఖాస్తు ఫారంతో పాటు దరఖాస్తుదారుని పాస్‌ఫొటో, ఆధార్, తెల్లరేషన్ కార్డు, గ్యాస్ కనెక్షన్ బుక్ జిరాక్స్‌లను జత చేయాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ ఎం.డీ ఇక్బాల్, డీటీ శ్రీనివాస్, ఎంపీవో రామస్వామి, ఏపీవో ధనుంజయరాజ్, ఆర్ఐ రాములు పాల్గొన్నారు.

### గోపాల్ పేట మండలంలో..

గోపాల్‌పేట, డిసెంబర్ 27 : మండలంలో గురువారం నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హుస్సేనప్ప, తాసీల్దార్ శ్రీనివాసులు బుధవారం ప్రకటనలో తెలిపారు. 28వ తేదీ పాటిగడ్డ తండా, లక్ష్మీ తండా, చాకల్‌పల్లి, అమడాల కుంట తండా, 29న కర్నమయ్యకుంట తండా, అనంతపురం, మున్ననూర్, జయన్న తిరుమలాపురం, 30న బుద్ధారం, జనవరి 2న గోపాల్‌పేట, 3న పొల్కెపహాడ్, 4న ఏదుల, 5న ఏదుట్ల, 6న తాడిపర్తి, చెన్నూర్ గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

### ఖిల్లాఘణపురం మండలంలో..

ఖిల్లాఘణపురం, డిసెంబర్ 27 : ఈనెల 28వ తేదీ నుంచి జనవరి 6 వరకు ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. మహాలక్ష్మి , రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్ల పథకం, చేయూత పథకాల అమలుకు దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. 28వతేదీన అగారం, అల్లమాయిపల్లి, కోతులకుంటతండా, 29న అప్పారెడ్డిపల్లి, సల్కలాపూర్, దొంటికుంటతండా, రుక్కన్నపల్లి, ఈర్లతండా, 30న అముదంబండతండా, కర్నెతండా, ఉప్పర్‌పల్లి, మల్కిమియాన్‌పల్లి, జనవరి 2న ఘణపురం, కమాలుద్దీన్‌పూర్, గట్టుకాడిపల్లి, పర్వతాపూర్, 3న సోలీపూర్, మానాజీపేట, 4న మల్కాపూర్, షాపూర్, సురాయపల్లి, 5న మామిడిమాడ, తిరుమలాయపల్లి, అంతాయపల్లి, 6న వెనికితండా, వెంకటాంపల్లి, రోడ్డుమీదితండాలో నిర్వహిస్తారన్నారు. దరఖాస్తుల ఫారమ్‌లు పంచాయతీ కార్యదర్శులతో అందుబాటులో ఉంటాయని, దరఖాస్తు చేసుకునే వారు ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌ను జతపరర్చాలని సూచించారు.

### అమరచింత మండలంలో..

అమరచింత, డిసెంబర్ 27: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో భాగంగా నేటి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారని మండల ప్రజాపాలన ప్రత్యేక అధికారి శ్రావణ్‌సింగ్, తాసీల్దార్ షేక్ చాంద్‌పాషా పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు, ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధశాఖ అధికారులతో ప్రజాపాలనపై మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, ఎంపీపీ మాలతీ అధ్యక్షతన బుధవారం వేర్వేరుగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం నుంచి మున్సిపాలిటీ వార్డులతోపాటు వివిధ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతి రోజూ రెండు చోట్ల నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీడీవో జ్యోతిఫరూసీయా, ఎంపీవో నర్సింహయ్య అధికారులు ఉన్నారు.

### నేటి నుంచి వార్డుల వారీగా ప్రజాపాలన

వనపర్తి, డిసెంబర్ 27 : ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం గురువారం నుంచి జనవరి 6 వతేది వరకు మున్సిపాలిటీ పరిధిలోని 33 వార్డుల్లో రోజు వారీగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బుధవారం ప్రకటనలో తెలపారు. గురువారం నుంచి రోజుకు నాలుగు వార్డుల చొప్పున నిర్వహిస్తామని తెలిపారు.

### విద్యుత్ సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ

వనపర్తి, డిసెంబర్ 27 : ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గురువారం నుంచి ఆరు గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తులతోపాటు విద్యుత్‌కు సంబంధించిన బిల్లుల సవరణ, లో వోల్టేజ్ సమస్యలు, శిథిలావస్థ, ప్రమాదకరంగా ఉన్నటువంటి విద్యుత్ స్తంభాలు, వైర్లు తొలగింపు తదితర సమస్యల పరిష్కారానికి వినతులు స్వీకరిస్తున్నట్లు బుధవారం ప్రకటనలో వనపర్తి సూపరింటెండెంట్ ఇంజినీర్ నరేంద్రకుమార్ తెలిపారు.

### 'ప్రజాపాలన'లో వినతి పత్రాలు అందజేయాలి

వనపర్తి, డిసెంబర్ 27 : ప్రతి గ్రామంలో నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో గొల్లకురుమలు లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేయాలని వినతి పత్రాలను అందజేయాలని గొర్రెల కాపరుల సంఘం మాజీ జిల్లా కన్వీనర్ కురుమూర్తి యాదవ్ కోరారు. బుధవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించి, ప్రభుత్వ ఖాతాలో జమ అయిందన్నారు. ఎన్నికలు రావడంతో పంపిణీ నిలిచి పోయిందని, కొత్త ప్రభుత్వం గొల్ల కురుమలకు మిగతా యూనిట్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా గొల్ల కురుమలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

## 2నుంచి సంతాన వేణుగోపాల స్వామి ఉత్సవాలు

గద్వాలటౌన్, డిసెంబర్ 27: జనవరి 2నుంచి 4వ తేదీ వరకు సంతాన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు రాజవంశీయులు, ఆలయ ధర్మకర్తలు విక్రమసింహారెడ్డి, సుహాసినిరెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆలయ ప్రాంగణంలో వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థాన కాలం నుంచి స్వామి వారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవం, రథోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు, ప్రజలు ఉత్సవాల్లో అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సంయుక్తమ్మ, అర్చకులు సంవృత్ భరద్వాజ్, పవన్, సతీశ్, బజారన్న పాల్గొన్నారు.

## కో ఆప్షన్ పదవికి రాజీనామా

అమరచింత, డిసెంబర్ 27 : మున్సిపాలిటీలో కో ఆప్షన్‌గా ఉన్న ఏపీ రాజేందర్ తన పదవికి రాజీనామా చేస్తూ తన రాజీనామా పత్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహ్మద్‌ఖాజాకు అందజేసినట్లుగా బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ పాలనలో ఏర్పడ్డ అమరచింత మున్సిపాలిటీలో తనను సామాజిక సేవలో ప్రజలకు సేవ అందించేందుకు కో ఆప్షన్ సభ్యులుగా ఎంపిక చేశారని, గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో నైతిక బాధ్యతతో మున్సిపల్ కో ఆప్షన్ పదవికి రాజీనామా చేస్తున్నానన్నారు. ఇదే విషయాన్ని తెలియపరుస్తూ తన రాజీనామా లేఖను చైర్‌పర్సన్, కమిషనర్‌కు అందజేసినట్లుయన తెలిపారు.

## అధ్యక్షుడి ఎన్నికపై చెరుకు రైతుల హర్షం

అమరచింత, డిసెంబర్ 27: ఆల్ ఇండియా షుగర్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడిగా మండవ ప్రభాకర్‌రావును ఎకగ్రీవంగా ఎన్నుకోవడంపై మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల చెరుకు రైతుల సంఘం అధ్యక్షుడు కంకలి రాజన్న హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ దీర్ఘకాలం సీడ్స్ గ్రూప్ చైర్మన్‌గా పనిచేసిన ప్రభాకర్‌రావుకు చెరుకురైతుల సమస్యలపై చాలా అవగాహన ఉందని అందుకోసమే ఆయనను ఆల్ ఇండియా అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు.

## శబరిమలకు అయ్యప్పస్వాములు

కొత్తకోట, డిసెంబర్ 27 : పట్టణంలోని పలువురు అయ్యప్ప స్వాములు గోపాల గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకొని బుధవారం శబరిమలకు బయలుదేరారు. 17 సార్లు శబరిమలకు వెళ్తున్న రఘుచారి గురుస్వామికి అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాగరాజు, లింగేశ్వర్, అనిల్, రవిరెడ్డి, రాజశేఖర్, శ్రీనివాసులు, సత్యంసాగర్, యాదిరెడ్డి, కృష్ణచారి, మోహన్, రామకృష్ణ, రాజు, నితిన్ పాల్గొన్నారు.

## శివలింగానికి ప్రత్యేక పూజలు

కొత్తకోట, డిసెంబర్ 27 : మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలోని దత్త కోటిలింగేశ్వర ఆలయంలో బుధవారం శివుడి జన్మనక్షత్ర ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకాలు, ఏకరుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో కండక్టర్ శేఖరయ్య, మహేశ్వర్, అర్చకులు జగదీశ్, అనిల్ పాల్గొన్నారు.

## ముళ్ల పొదల తొలగింపు

అయిజ, డిసెంబర్ 27: ఆర్డీఎస్ ప్రధానకాల్వపై ఏపుగా పెరిగిన ముళ్ల పొదలను లస్కర్లు తొలగిస్తున్నారు. ప్రధాన కాల్వపై ఏపుగా ముళ్ల పొదలు పెరగడంతో నీటి పారుదలతోపాటు లస్కర్లు పర్యటించేందుకు ఇబ్బందులు కలుగుతుండటంతో ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏఈ రాందాస్ పర్యవేక్షణలో బుధవారం లస్కర్లు ముళ్ల పొదలను తొలగించారు. ప్రస్తుతం నీటి పారుదల లేక పోవడంతో ప్రధానకాల్వపై పెరిగిన ముళ్ల పొదలను తొలగించేందుకు పూనుకున్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. మేడికొండ సమీపంలోని 16ఏ డిస్ట్రిబ్యూటరీ సమీపంలోని ముళ్ల పొదలను తొలగించినట్లు పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెబ్బేరు, డిసెంబర్ 27: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పెబ్బేరు సమీపంలో 44వ నెంబరు జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. ఎస్సై జగదీశ్వర్ కథనం ప్రకారం 55 ఏండ్ల వయస్సు ఉన్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనాలు ఢీకొట్టడంతో అతని శరీరం ఛిద్రమైంది. తల నుజ్జునుజ్జు కావడంతో ఏ మాత్రం గుర్తుపట్టే వీలు లేకుండా పోయింది. అతడు నీలం రంగు షర్టు మీద నల్లటి స్వెట్టర్‌తోపాటు నషం కలర్ అడ్డ పంచ ధరించి ఉన్నాడని ఆయన తెలిపారు. హైవే పెట్రోలింగ్ అధికారి తిక్కయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు తెలిపారు. శవాన్ని వనపర్తి ఏరియా దవాఖానలో పోస్టుమార్టం చేయించి, ఐదు రోజుల పాటు ఫ్రీజర్‌లో ఉంచనున్నట్లు, అతడి సంబంధికులు ఎవరైనా ఉంటే పెబ్బేరు పోలీసులను సంప్రందించాలని ఎస్సై కోరారు.

## రైస్ మిల్లు యాజమానిపై కేసు నమోదు

కొత్తకోట, డిసెంబర్ 27 : మండలంలోని మీరాసిపల్లి గ్రామ శివారులోని కిసాన్ ట్రెడర్స్ మిల్లు యాజమాని మధుకుమార్‌రెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. సివిల్ సప్లై అధికారి ధనావత్‌బాలు, ఇతర సిబ్బంది ఈనెల 13న రైసు మిల్లులో వానకాలం సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ వడ్లను తనిఖీ చేయగా 26000 సంచులు(బస్తాలు)ధాన్యం లేవని విచారణలో తేలింది. దీంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వగా కలెక్టర్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సదరు రైసు మిల్లు యాజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## కారు బోల్తా: ఏడుగురికి గాయాలు

కొత్తకోట, డిసెంబర్ 27 : కారు బోల్తాపడిన ప్రమాదంలో ఏడుగురికి గాయాలైన ఘటన మండలంలోని ముమ్మళ్లపల్లి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకున్నది. ఎస్సై మంజునాథ్ రెడ్డి కథనం ప్రకారం హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు మహిళలు, నలుగురు చిన్నారులు కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ముమ్మళ్లపల్లి గ్రామ సమీపంలో మరో వాహనాన్ని ఓటర్ టేక్ చేయబోయి అదుపు తప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. కారు డ్రైవర్ వెంకటయ్యతోపాటు ప్రియ, స్వర్ణ, మంజుల, చిన్నారులు నగేశ్, సహస్, నిహాల్, కార్తీకేయకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా దవాఖానకు తరలించి చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ధరూర్ ఎంపీపీపై అవిశ్వాసానికి రంగం సిద్ధం

- తీర్మానంపై అదనపు కలెక్టర్, ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన ఎంపీటీసీలు

గద్వాల,డిసెంబర్ 27 : నియోజకవర్గపరిధిలోని ధరూర్ ఎంపీపీ నజమున్నీషాబేగంపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమైంది. మండల అభివృద్ధికి సహకరించకపోవడంతోపాటు ఏక పక్షనిర్ణయాలు తీసుకోవడం, అధికారులను ఇబ్బందులకు గురి చేయడం లాంటి ఘటనలు చోటు చేసుకోవడంతో ఆమెపై అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు ఎంపీటీసీలు అదనపుకలెక్టర్, ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. బీఆర్‌ఎస్ నుంచి ధరూర్ ఎంపీపీగా ఎన్నికైనా నజమున్నీషాబేగం అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం గద్వాల కాంగ్రెస్ అభ్యర్థి ఓడి పోవడం, బీఆర్‌ఎస్ అభ్యర్థి కృష్ణమోహన్‌రెడ్డి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. అయినప్పటికీ ఇక్కడి ఎమ్మెల్యేతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు పెద్దగా పట్టించుకోలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఇక్కడ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా ఉండడంతో ఇక్కడ అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ నాయకుల ఆగడాలు ఎక్కువ కావడంతో అందుకు విసుగు చెందిన బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో ఈ మధ్యనే ధరూర్ మండలానికి చెందిన ఓ కాంగ్రెస్ నేత ఎంపీపీ ఆధ్వర్యంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్రంలో అధికారంలో మేమున్నామని ఇక్కడి అధికారులు మేము చెప్పినట్లు నడుచుకోవాలని లేని పక్షంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించడంతోపాటు బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు, సర్పంచులకు సంబంధించిన పనులు మాకు తెలియకుండా చేయకూడదని ఆదేశాలు జారీ చేయడంతో విసుగు చెందిన ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు. ధరూర్ మండలంలో మొత్తం 14మంది ఎంపీటీసీలు ఉన్నారు. అందులో గుడ్డెందొడ్డి ఎంపీటీసీ డిస్క్వాలిఫై కాగా భీంపురం ఎంపీటీసీ మృతిచెందారు. ప్రస్తుతం 12 మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఇందులో ఎనిమిది మంది ఎంపీటీసీలు బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్లు సమాచారం. ధరూర్ మండలానికి చెందిన ఓ నేత తీరు వల్లే తాము అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు తెలిపారు. మరి అవిశ్వాసం నెగ్గుతుందో లేదో చూడాలి.

### అభివృద్ధికి సహకరించక పోవడం వల్లే..

మండలంలో ఎటువంటి సంబంధం లేని వ్యక్తి ఎంపీపీని అడ్డం పెట్టుకొని రాజకీయం చేయాలని చూడడంతోపాటు అధికారులను వేధించడం, మండల అభివృద్ధికి సహకరించకపోవడం వల్ల ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టినట్లు చెప్పారు. ఈ విషయం అదనపు కలెక్టర్, ఆర్డీవోకు వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు.

-సుదర్శన్‌రెడ్డి, ధరూర్ వైస్ ఎంపీపీ



వినతి పత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ